# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- "ఆపరేషన్ సిందూర్" విజయం సందర్భంగా జాతీయ సమైక్యత, సమగ్రతను చాటి చెప్పేలా రాష్ట్ర వ్యాప్తంగా తిరంగా ర్యాలీని చేపట్టారు.
- విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన జరిగే "అంతర్జాతీయ యోగా డే"ను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద ఎత్తున పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

======================

విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన జరిగే 11వ అంతర్జాతీయ యోగా డేను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగా డే కార్యచరణపై ఈరోజు అమరావతిలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. 'యోగాంధ్ర-2025' ఇతివృత్తంతో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలని, దీని కోసం ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు "యోగా మంత్" పాటించాలని తెలిపారు. నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణ చేపట్టాలని, శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ ప్రసంశాపత్రాలు అందజేయాలని తెలిపారు.

======================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అనంతపురం జిల్లా బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు మంత్రి ఈరోజు భూమిపూజ చేశారు. 2 వేల

300 ఎకరాల్లో 22 వేల కోట్ల రూపాయలతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో 10 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలో పేర్కొన్న విధంగా నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మన నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా.. దేశ అవసరాలకు కూడా ఉపయోగపడనుందని తెలిపారు. ఇటువంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం టాటా ఎనర్జీ, టీసీఎస్ సహా అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

======================

పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతూనే పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈరోజు విశాఖపట్టణలో జరిగిన సస్టైనబిలిటీ సమ్మిట్ - 2025 కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాతావరణ సమతుల్యతను పాటిస్తూ.. అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నామని, దానిలో భాగంగానే 4.0 ఎంఎస్ఎంఈ పాలసీని రూపొందించామని తెలిపారు. సోలార్, పంప్డ్ ఎనర్జీ, బయో ఇంధన వనరులతో కూడిన 20 గిగా వాట్ల విద్యుత్ ఇంధన వనరుల ఉత్పత్తికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఆపరేషన్ సింధూర్ లో దేశ సైనికుల ధైర్య సాహసాలు, త్యాగాలను కొనియాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీలో భాగంగా అన్నమయ్య జిల్లా మదనపల్లెలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీర సైనికుల విజయకేతనానికి సంఘీభావం తెలుపుతూ ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో పాటు అనేక మంది ప్రజలు తిరంగా ర్యాలీలో పాల్గొని భారత సైన్యానికి తమ మద్దతు తెలిపారు.

దేశం కోసం అనునిత్యం శ్రమిస్తూ.. తమ ప్రాణాలను సైతం అర్పిస్తున్న భారత సైనికుల సేవలు అభినందనీయమని పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా విజయం సాధించిన భారత సైనికులకు మద్దతుగా ఈరోజు పార్వతీపురంలో జాతీయ జెండాలతో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు.

విరామం

======================

గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు మండలం తోణాం గ్రామంలో సుమారు కోటి 80 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోణాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామస్తులకు ప్రాథమిక వైద్య సదుపాయాలు, బాలింతల సంరక్షణ, టీకాలు, సాధారణ వైద్య పరీక్షలు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. అత్యంత కీలకమైన ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మద్దతుగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ కు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

విజయనగరం జిల్లా భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్న నేపథ్యంలో పర్యాటకుల కోసం అవసరమైన హోటళ్లు, రిసార్టుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. భోగాపురం వద్ద ఏర్పాటు కానున్న పలు హోటళ్లు, రిసార్టుల ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యాటక రంగం అభివృద్ధికి హోటళ్ల నిర్మాణం ఎంతో ముఖ్యమని.. వీటి అభివృద్ధితో ఉపాధి కల్పన కూడా లభిస్తుందన్నారు.

=======================

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉగ్రవాదాన్ని ధీటుగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్ కు ఉందని ఇది ఛాటి చెప్పింది. ఆపరేషన్ సింధూరిలో దేశ సైనికుల ధైర్య సాహసాలు, త్యాగాలను కొనియాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ విద్యార్థులలో జాతీయత భావాన్ని పెంపొందిస్తుందని రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ వై.హెచ్.ప్రసాద్ అన్నారు. ఈరోజు ఆయన విశాఖపట్నం ఆకాశవాణితో మాట్లాడుతూ... ఈ తిరంగా ర్యాలీ జాతీయ సమైక్యత, సమగ్రత చాటుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

=======================

పహల్గాంలో భారతీయులపై ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాడాన్ని కీరిస్తూ.. కొద్దిసేపటి క్రితం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తిరంగా ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి బెంజ్ సర్కిల్ వరకు కొనసాగుతుంది. ఈ తిరంగా ర్యాలీలో ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలు ప్రజలు పాల్గొన్నారు.

=======================

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఆగస్టు నెల కోటాను ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఒక ప్రకటనలో తెలిపింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను మే 22న ఉదయం 10 గంటలకు, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లను విడుదల చేయనున్నట్లు తెలిపింది.

=======================

=======================